www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 86 | శుక్రవారం | 6 సెప్టెంబర్, 2024

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681



## ఉత్సవాలకు రండి..

వినాయక నవరాత్రి ఉత్సవాలకు రావాలని సీ. రెడ్డిని ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆ అందించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్య రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్చకులు ఆశీర్వ అందించారు. వీరివెంట ఖైరతాబాద్ ఎమ్మెల్యే నాగేదంర్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉంటే గణేశ్ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు.

## విమర్శించడమే వాళ్ల పని

- వరదలపై బీఆర్ఎస్ బురద రాజకీయాలు
- ఎక్స్ ఖాతాలో విషం చిమ్ముతున్న కేటీఆర్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం



5 లో..

## ఏఐతో సరికొత్త భవిష్యత్తును

# ఆవిష్కరిద్దాం






- ముందు తరాల కోసం బలమైన పునాది వేశాం.
- ఏఐ పెట్టుబడి దారులకు మొదటి ప్రాధాన్యం
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ప్రపంచమే మారుతోంది
- ప్రపంచగతిని మార్చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు
- కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో పెను మార్పులు
- 'గ్లోబల్ ఏఐ' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ఏఐ రాజధాని ప్రణాళికపై ఐబీఎం ప్రెసిడెంట్ ఆసక్తి

"విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికల పట్ల ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ ఆసక్తి కనబరిచారు.

మిగతా 2 లో



కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్

## తీర్పు రిజర్వ్

- తీర్పును 10కి వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం

2 లో..

## నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు!

- మిగతా ఎమ్మెల్యేలవి చేస్తున్నారని ఆరోపణలు
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



2 లో..

## ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో

# స్థానికత

- స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులే
- హైకోర్టులో విచారణ.. తీర్పు వెలువరించిన ధర్మాసనం



**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకో ర్టు గురువారం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధ ర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది.

మిగతా 2 లో

## కొణతం దిలీప్ అరెస్ట్

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్
- ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పాలని డిమాండ్
- నిర్బంధాలతో పాలన మీ భ్రమే!




2 లో..


మనఊరు-మనబడిని

## ఆపేసిన ప్రభుత్వం

- విద్యావ్యవస్థల మరింత బలోపేతం కావాలి
- గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే హరీష్ రావు



2 లో..



రోజుకో అత్యాచారం.. గంటకో అఘాయిత్యం..

## ఇదేనా మార్పు ?

- మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికారమెందుకు
- మంత్రి సీతక్కను నిలదీసిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

3 లో..

## జైనూరు బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ

3 లో..

నేడు ఖమ్మం జిల్లాలో

## కేంద్ర మంత్రుల పర్యటన

వరద నష్టంపై ఏరియల్ సర్వే

2 లో..

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

2

శుక్రవారం
6 సెప్టెంబర్ 2024




# ఏఐతో భవిష్యత్తును ఆవిష్కరిద్దాం

(మొదటి పేజీ తరువాయి..)

సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొనియాడారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. రైల్ ఇంజిన్, టీవీ, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ దాకా వచ్చాయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోంది.. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఏఐ కి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టబడి దారులను ఆహ్వానిస్తున్నామనం ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఏఐ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏఐలో పూర్తిగా పట్టు సాదించబోతున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. డీప్‌ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని చెప్పారు. ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని వివరించారు. రాబోయే రెండు రోజులు హెచ్‌ఐసీసీ వేదికగా ఏఐ పైనా చర్చలు, సెమినార్లు ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డెవలప్‌మెంట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం చేయొద్దని ఆయన సూచించారు. హైదరాబాద్ లో 200 ఎకరాలు కేటాయించి ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాము. రాబోయే మూడేళ్లల్లో గ్లోబల్ ఏఐ హబ్‌గా హైదరాబాద్ అవతరిస్తుందని మంత్రి అన్నారు. ఏఐ పెట్టుబడులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులైన 2వేల మంది ఏఐ నిపుణులు సదస్సుకు వచ్చారు.

# నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు!

- మిగతా ఎమ్మెల్యేలవి చేస్తున్నారని ఆరోపణలు
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- మీడియా సమావేశంలో పాడి గగ్గోలు

**కరీంనగర్, ప్రజానావ:** తన ఫోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని భారాస హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మా వ్యక్తిగత సమాచారం ఎలా తెలుస్తోంది. కరీంనగర్ సీపీ ఫోన్ కూడా ట్యాప్ చేస్తున్నారు. మానకొండూరు సీఐకి కాన్ఫరెన్స్ పెట్టడం లేదని మంత్రి, ఎమ్మెల్యేకు ఎలా తెలుసు? ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల ఫోన్లను ట్యాప్ చేయడం సిగ్గుచేటు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 40 శాతం మందికే రుణాలు మాఫీ అయ్యాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏ చెక్కులైనా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేకు హక్కు ఉంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీవి కావు.. అవి ప్రజల సొమ్ము. ఎన్నికల్లో ఓటమిపాలైన అభ్యర్థి చెక్కులు పంచుతున్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్తా. సీపీ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనపుడు కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలి' అని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం విధానంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌తోపాటు తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ.. దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. అందుకు సంబంధించిన తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఢిల్లీ సీఎం కేజీవాల్ దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. అనంతరం ఈ కేసులో తీర్పును మంగళవారానికి సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌తోపాటు తనను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. తన తీర్పును సెప్టెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది. ఏడాది మర్చి 21వ తేదీన ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం తీహార్ జైలుకు ఆయన్ని తరలించింది. జూన్ 26న ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సుప్రీంకోర్టు సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ అప్పటికే ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేయడంతో.. కేజ్రీవాల్ తీహార్ జైల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. క ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే జైల్లో ఉన్నారు. ఈ ఆగస్ట్‌లో ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్టయిన ముగ్గురు.. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత, ఆప్ పార్టీ కమ్యూనికేషన్ మాజీ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌లు బెయిలుపై విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో గతంలో అరెస్టయిన ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే.

# ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికత


- స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులే
- హైకోర్టులో విచారణ.. తీర్పు వెలువరించిన ధర్మాసనం



**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించింది. మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ రూల్ '3ఏ'ను చేరుస్తూ ప్రభుత్వం జీవో 33ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు. ఇతర రాష్ట్రాల వారితోపాటు భారతీయ మూలాలున్న ప్రవాసులు ఇక్కడ 4 ఏళ్లు చదువుకుంటే 85 శాతం స్థానిక కోటా కింద అవకాశం దక్కించుకుంటారన్నారు. దీనివల్ల తెలంగాణలో పుట్టిపెరిగిన వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక కోటా ఇక్కడ నివాసం ఉన్నవాళ్లకే అడుగుతున్నామని, చదువుకున్నవారు అన్న దానిపై అడగడం లేదన్నారు. ఉద్యోగులు బదిలీ కావడం వంటి పరిస్థితుల్లోనూ.. అలాగే మెరుగైన విద్య కోసం.. ఇంటర్ మరో రాష్ట్రంలో చదువుకున్న తెలంగాణ విద్యార్థి స్థానికుడు కాదనడం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల పిల్లలకు అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం.. ప్రైవేటు ఉద్యోగుల పిల్లలకు అవకాశం నిరాకరించడం వివక్ష చూపడమేనన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు. నిబంధనలు తీసుకువచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాల వారు పలు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజే జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం తీర్పును వెలువరించింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం పేర్కొంది. స్థానికత నిర్ధారణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని సచించింది. కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించిన అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది. వైద్యారోగ్యశాఖ జారీ చేసిన జీవోను పలువురు విద్యార్థులు సవాల్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొంది. సర్కారు జారీ చేసిన ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి విరుద్ధమని పిటిషన్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆయా పిటిషన్లపై వాదనలు విన్న సీజే ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

## కెనాల్స్, చెరువుల పునరుద్ధరణ
# తక్షణం టెండర్లు పిలవండి

**అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్**



**మహబూబాబాద్, ప్రజానావ:** భారీ వర్షాలకు తెగిపోయిన చెరువుకట్టలు, కెనాల్స్ పునరుద్ధరణకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సంభవించిన వర్షపు ఉధృతికి జరిగిన నష్టంపై గురువారం నాడు నీటిపారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులు, కాలువల పునరుద్ధరణతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న చెరువులు, కాలువల మరమ్మతులకు కూడా టెండర్ల పక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. వెంటనే పాలనాపరమైన అనుమతులు తీసుకుని శుక్రవారం ఉదయానికి ఆన్‌లైన్‌లో టెండర్లు అప్‌డేట్ చెయ్యాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇంతటి వర్షపు ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమయి పనిచేసిన నీటిపారుదల శాఖా సిబ్బందిని ఆయన అభినందించారు. అయితే అదే సమయంలో తాను స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు కొన్ని వాస్తవాలు వెలుగు చుశాయన్నారు. రెగ్యులేటరీలు, షట్టర్లు పనిచేస్తున్నాయా లేదా అన్న పరిశీలన కనిపించలేదన్నారు. తద్వారా విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఒక దగ్గర రెగ్యులేటరీ జామ్ అయ్యిందన్నారు. మరోచోట షట్టర్ ఎత్తుతుంటే తెగిపోయిందన్నారు. ఈ తరహా సంఘటనలు మరోసారి పునరావృతం అయితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు సీఈలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, హరేరాం, శంకర్.. నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, డిప్యూటీ ఈఎన్‌సీ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖా చీఫ్ ఇంజినీర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## మన ఊరు-మన బడి'ని మధ్యలోనే
# ఆపేసిన ప్రభుత్వం

- విద్యావ్యవస్థల మరింత బలోపేతం కావాలి
- గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట, ప్రజానావ:** విద్యావ్యవస్థ ఇంకా బలోపేతం కావాలని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో గురుపూజోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురు పుజోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ గురువులు అందరికీ గురు పుజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వివరించారు. ఎవరికి దొరకని గౌరవం ఓక ఉపాధ్యాయునికి దొరుకుతుందని అన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండో స్థానంలో ఉపాధ్యాయులు నిలిపారని ప్రశంసించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ట్రిబుల్ ఐటీలో మొదటిస్థానంలో ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ తెలంగాణలోని పాఠశాల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. 'మన ఊరు – మన బడి' పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా ప్రారంభించామని తెలిపారు. మన ఊరు – మన బడి' పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిందని ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్?లో ఉన్నామని..వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత కరెంటు లేదని.. స్కవెంజరు?లు లేరని చెప్పారు. విద్యా వలంటీర్లు, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని తీసివేతలు, ఏరివేతలు కోతలు పెడుతున్నారని ఆరోపణలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా నిలయంగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు.

## నేడు ఖమ్మం జిల్లాలో
# కేంద్ర మంత్రుల పర్యటన

**వరద నష్టంపై శివరాజ్ సింగ్ చౌహాన్, బండి సంజయ్ ఏరియల్ సర్వే**



**హైదరాబాద్, ప్రజానావ:** భారీ వర్షా లు, వరదలతో రాష్ట్రం నష్టపోయిన నేపథ్యంలో కేంద్రం ఏరియల్ సర్వేకు సిద్ధమైంది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం ఉదయం వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన ఖమ్మం జిల్లాల్లో కేంద్ర మంత్రులు ఏరియల్ సర్వే చేయనున్నారు. అందులో భాగంగా రేపు ఉదయం 9 గంటలకు విజయవాడ నుండి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ నేరుగా ఖమ్మం వస్తుండగా, బండి సంజయ్ కుమార్ ఆయనతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయనున్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించి వరద నష్టంపై అడిగి తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఖమ్మం జిల్లాలోనే మంత్రులు పర్యటిస్తారు. అనంతరం శివరాజ్ సింగ్ తిరిగి ప్రత్యేక విమానంలో భోపాల్ వెళతారు. బండి సంజయ్ మాత్రం ఖమ్మం పట్టణంలోని 30వ డివిజన్ మోతె నగర్ లో, 35వ డివిజన్ పంపింగ్ వెల్ రోడ్ లోని పెద్దమ్మ తల్లి దేవాలయ పరిధి సమీపంలోని బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి కోదాడ చేరుకుంటారు. కోదాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తారు. పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తారు. బాధిత కుటుంబాలతో మాట్లాడతారు. పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి వరద నష్టంపై వివరాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం మీడియాతో మాట్లాడతారు. కోదాడ పర్యటన అనంతరం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పర్యటనకు బయలుదేరి వెళతారు.



# బీజేపీలో చేరిన క్రికెటర్ జడేజా

**గాంధీనగర్:** ఇండియన్ స్టార్ క్రికెటర్ రవీంద్ర జడేజా గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. అందుకు సంబంధిం చిన ఫొటోను ఆయన భార్య, బీజేపీ ఎమ్మెల్యే రివాబా జడేజా సోషల్ మీడియాలో షేర్ చేశారు. తనతోపాటు తన భర్త రవీంద్ర జడేజా బీజేపీలో సభ్యత్వం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. 2019లో రివాబా బీజేపీ చేరారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అంటే.. 2022లో గుజరాత్‌లోని జామ్ నగర్ ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు.

# పాల బిల్లుల కోసం రైతుల ఆందోళన

**నాగర్‌కర్నూల్, ప్రజానావ:** పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని పాడి రైతులు రోడెక్కారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గేట్ వద్ద కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా క్యాన్లలో ఉన్న పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలు పోస్తున్నామని, అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెండు నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు.


# కొణతం దిలీప్ అరెస్ట్

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్
- ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పాలని డిమాండ్

**ఖైరతాబాద్, ప్రజానావ:** డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో దిలీప్ కొణతం తప్పుడు వార్తలను చూపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో దిలీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదుపులోకి తీసుకున్న కొణతం దిలీప్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అరెస్ట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చునుకుంటే అది మీ భ్రమే. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింత మంది పుట్టుకొస్తారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలి. 9 నెలలుగా తెలంగాణలో వాక్ స్వాతంత్రం లేదు. నిరంకుశ పాలన సాగుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. దిలీప్ అక్రమ అరెస్టును జగదీశ్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు.కొంతకాలంగా ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని దిలీప్ ప్రశ్నించడాన్ని రేవంత్ సర్కారు తట్టుకోలేకపోతోందన్నారు. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించగా హైకోర్టు చీవాట్లు పెట్టినా, బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఎలాగైనా దిలీప్ గొంతు నొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపు లోకి తీసుకున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో చెప్పకుండా అరెస్ట్ చేశారు. ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కటమేనా ప్రజాపాలన అంటే? అని ప్రశ్నించారు.

# సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

**త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి**



**మహబూబాబాద్, ప్రజానావ:** సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సేంద్రియ వ్యవసాయం ప్రజల ఆరోగ్యానికి అవసరమని అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో సొల్లేటి జయపాల్ రెడ్డికి చెందిన అభినవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఆర్గానిక్ వ్యవసాయ విధానాన్ని అవలంబించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండిన ధాన్యాన్ని తినడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తున్నదని, ఆర్గానిక్ వ్యవసాయ విధానంపై రైతుల దృష్టి పెట్టాలని కోరారు. ఈ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తున్న సొల్లేటి జయపాల్ రెడ్డిని అభినందించారు. అనంతరం తన పర్యటన ముగించుకుని నల్గొండ జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
6 సెప్టెంబర్ 2024


# రైల్వే ట్రాక్‌పై చంద్రబాబు.. తృటిలో తప్పిన ప్రమాదం

**విజయవాడ, ప్రజానావ:** విజయవాడ పరిధిలోని మధురానగర్‌లో వరద సహాయక చర్యలను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పెను ముప్పు తప్పింది. రైలు వంతెన పైకి నడిచి బుడమేరు ఉధృతిని చంద్రబాబు పరిశీలించారు. రైలు వంతెనపై ఆయన నడుస్తుండగానే రైలు ఎదురుగా రావడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. చంద్రబాబుకు అతి సమీపంగా రైలు వెళ్లింది. రైలు తగలకుండా సీఎం ఓ పక్కకు నిలబడి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. రైలు వెళ్లిపోయాక అధికారులు, భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. జస్ట్ మూడు అడుగుల దూరంలో ట్రైన్ ఆగిపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగానే సీఎం చంద్రబాబు ముధరా నగర్ రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇదే సమయంలో ట్రాక్‌పై నుంచి ట్రైన్ వస్తోంది. ఇది గమనించిన భద్రతా సిబ్బంది.. ట్రైన్ వస్తోందని, అక్కడి నుంచి వెళ్దామని చెప్పారు. మరోవైపు విషయాన్ని గమనించిన చంద్రదండు కార్యకర్తలు.. లైన్‌మెన్‌ను అలర్ట్ చేశారు. అతను ట్రైన్‌కు ఎర్రజెండా ఊపడంతో ట్రైన్ స్లో అయ్యింది. చంద్రబాబు భద్రతా సిబ్బంది ఆయన చుట్టూ సరౌండ్ అయ్యారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుబాబు కూడా చంద్రబాబు వెన్నంటి ఉన్నారు. ట్రైన్ సరిగ్గా మూడు అడుగుల దూరంలో ఆగిపోయింది. దీంతో భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# మరోమారు రంగంలోకి దిగిన బాబు





**• ఏలూరు, బుడమేరు కాల్వల పరిశీలన**

**విజయవాడ, ప్రజానావ:** నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు మరోసారి పర్యటించారు. ఎనికేపాడు వద్ద ఏలూరు కాల్వ, బుడమేరు ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బల్లకట్టుపై బుడమేరు దాటి ముంపు ప్రాంతాల్లో సీఎం పర్యటించారు. గండ్లు పడిన ప్రాంతాల్లో పనులపై అధికారులతో ఆయన చర్చించారు. దెబ్బతిన్న పంటల వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా... భారీ వర్షాలు, వరదలతో ఏపీలో పరిస్థితి దారుణంగా ఉంది. విజయవాడలో అనేక ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వివిధ రకాలుగా వరద బాధితులు ఆహారం, మంచి నీరు, మందులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పడవలు, హెలీకాప్టర్లు, డ్రోన్ల సాయంతో కాలనీల్లో బాధితులకు భోజనాన్ని సరఫరా చేస్తున్నారు.

మరోవైపు బుడమేరు వరద నుంచి ఇప్పుడిప్పుడు బెజవాడ వాసులు కాస్త కోలుకుం టున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు ముంపు ప్రాంతాల్లో భారీ ఎత్తున సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. నిన్న ఉదయానికి నాటికి రెండు నుంచి మూడు అడుగుల మేర సింగ్‌నగర్ దూర ప్రాంతాల్లో వరద మట్టం తగ్గింది. దీంతో గత మూడు రోజులుగా బిక్కుబిక్కుమంటూ గడిపిన వరద బాధితులు బయటకు వచ్చేశారు. సింగ్‌నగర్ నుంచి దూరప్రాంతాలైన కండ్రిక, ఆంధ్రప్రభ కాలనీ, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, రాధానగర్, డాబాకొట్లు సెంటర్, ఇందిరానాయక్ నగర్, పైపులరోడ్డు, తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా వరద బాధితులు సురక్షిత ప్రాంతాలకు పోటెత్తారు. కాగా... బాధితుల తరలింపు తక్కువగా ఉండటం వల్ల అగ్నిమాపక శకటాలు తమ పనులు నిర్వహించలేకపోయాయి. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకుల పంపిన ట్రాక్టర్లు బాధితుల రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వరద నుంచి వచ్చే బాధితులు దాదాపుగా నాలుగు నుంచి పది కిలో మీటర్ల మేర నడుచుకుని రావటంతో వారికి స్వాంతన కలిగించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆటోలు, లారీలు, మినీవ్యాన్‌లు, ట్రాక్టర్ల వంటివి పెద్ద సంఖ్యలో నడిపాయి. పైపులరోడ్డు, గొల్లపూడి, తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది.

# జైనూరు బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ

**ఖైరతాబాద్, ప్రజానావ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆదివాసీ మహిళను గాంధీ ఆసుపత్రిలో మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. ఆదివాసీ మహిళకు జరుగుతున్న శస్త్ర చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఎస్టి సంక్షేమ శాఖ తరఫున లక్ష రూపాయల పరిహారాన్ని అందజేశారు. ఘటన విషయంలో కొందరు చేస్తున్న విమర్శలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దాడి ఘటనను పక్కదారి పట్టించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. తక్షణ పరిహారంగా లక్ష రూపాయలు ఇస్తే.. దాన్ని కూడా తప్పు పడతారా? ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని తెలవగానే ప్రభుత్వం వెంటనే స్పందించింది. దోషులకు కఠినంగా శిక్ష పడేలా చేయడం మా బాధ్యత. మహిళా సంక్షేమ శాఖ మంత్రిగా, ఆడబిడ్డగా, ఆదివాసీ బిడ్డగా నాకు ఇంకా ఎక్కువ బాధ్యత ఉంది.. అందుకే బాధితురాలికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నాం.. ఎవరు అనుమానాలు పడాల్సిన అవసరం లేదు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తాం. ఇప్పటికే నిందితుని అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశాం. చట్ట పరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపట్టాం. ఘటనకు మతం రంగు పూసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. మత కొట్లాటలు లేపేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారు. వారి పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలి' అని సీతక్క పిలుపునిచ్చారు.



### రోజుకో అత్యాచారం.. గంటకో అఘాయిత్యం..

# ఇదేనా మార్పు ?

**● మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికారమెందుకు**

**● మంత్రి సీతక్కను నిలదీసిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి**

**హైదరాబాద్:** ఆదివాసీ ఆడబిడ్డపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ధర్నాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గురువారం గాంధీ హాస్పిటల్‌లో ఉన్న బాధిత మహిళను పరామర్శించడానికి వెళ్లిన శిల్పారెడ్డి బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. మహిళపై జరిగింది హత్యాచారమే అని కుటుంబ సభ్యులు మీడియా సాక్షిగా చెప్పినా మంత్రి సీతక్క ఈ కేసుని పక్కతోవ పట్టించే తీరును నిరసిస్తూ మహిళకి న్యాయం జరగాలని గాంధీ హాస్పిటల్ ముందు బైఠాయించారు. బాధిత మహిళా కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని పక్కతొవ్వ పట్టించేందుకు మంత్రి సీతక్క వచ్చారని నీలదీశారు. ఈ సంఘటనను అత్యాచారం, హత్యాయత్నంగానే చూడాలని, కమ్యూనల్ ఇష్యూగా చిత్రీకరించవద్దని సూటిగా మంత్రిని హెచ్చరించారు. నిందితుడికి ఉరిశిక్ష విధించి, బాధిత మహిళకున్యాయం చేకూర్చాలని, లేని పక్షంలో రాష్ట్ర మహిళా మోర్చా తరఫున మునుమందు చెపట్టబోయే కార్యక్రమాలు తీవ్రంగా ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని శిల్పారెడ్డి హెచ్చరించారు.

# న్యాయవ్యవస్థలో నూతన అధ్యాయం

**కొత్త చట్టాల మేరకు హంతకులకు జీవిత ఖైదు**

**పట్నా:** భారత న్యాయవ్యవస్థలో ఇటీవల నూతన అధ్యాయం మొదలైంది. ఈ ఏడాది జులై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయి. కాగా.. ఈ కొత్త నేర చట్టాల కింద తాజాగా తొలి శిక్ష పడింది. ఓ హత్య కేసుకు సంబంధించి బిహార్‌లో ఇద్దరికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఘటన జరిగిన 48 రోజుల్లోనే వారికి దోషులుగా తేల్చి శిక్ష ఖరారు చేయడం గమనార్హం. బిహార్‌లోని శరణ్ జిల్లాలో జులై 17న మూక హత్యలు జరిగాయి. ధనాదిహ్ గ్రామానికి చెందిన తారకేశ్వర్ సింగ్ కుటుంబంపై దుండగులు దాడి చేశారు. డాబాపై నిద్రిస్తున్న వారిని విచక్షణా రహితంగా పొడిచారు. ఈ ఘటనలో తారకేశ్వర్, ఆయన ఇద్దరు కుమార్తెలు ప్రాణాలు కోల్పోగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే దాడికి పాల్పడిన సుధాన్షు కుమార్, అంకిత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన 14 రోజుల్లోనే వీరిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం వీరిద్దరినీ దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. గురువారం వీరికి జీవిత ఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. కొత్త నేర చట్టాల కింద దేశంలో తొలి శిక్ష ఇదేనని తెలిపారు.



# బిజెపి ఎమ్మెల్యే గృహ నిర్బంధం

**ఆదిలాబాద్, ప్రజానావ:** ఆదిలాబాద్ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఆదివాసీ మహిళపై ఓ వర్గానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బిజెపి దీనిపై ఆందోళనకు దిగుతోంది. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేసి, ఆయన ఇంటి చుట్టూ పోలీసులు మొహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు జరిగితే గళమెత్తే ఓవైసీ సోదరులు ఆదివాసీ మహిళపై అఘాయిత్యం జరిగితే ఎందుకు భిన్నంగా స్పందిస్తున్నారని ధ్వజమెత్తారు. రోహింగ్యాలు, పాకిస్థానీయులు ఇక్కడకు వచ్చి తలదాచుకుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జైనూర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# తాలిపేరు ప్రాజెక్టుకు మళ్లీ వరద

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజానావ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యంతర ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తుతోంది. జలాశయం ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాలకు భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి 46 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తాలిపేరుతో పాటు చింతవాగు, రోటెంత వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏఈ ఉపేందర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



# నిండుకుండలా నిజాంసాగర్

**మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటి విడుదల**

**కామారెడ్డి, సెప్టెంబర్ 5 :** కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భారీగా వరద అక్కడికి చేరుతోంది. దీంతో 3 గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ మేరకు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు. ప్రస్తుతం 1,404 అడుగులకు చేరుకుంది. దీంతో మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం 2 లక్షల 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండడంతో 3లక్ష 24వేల క్యూసెక్కుల ఔట్ ఎ÷-లోను 41 వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలో గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా 1,089 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 73.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. నవీపేట మండలంలోని మిట్టాపూర్ శివారులోని వందలాది ఎకరాల పంట నీట మునిగింది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో వరి పైర్లు పూర్తిగా మునిగి పోయాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. మండలంలోని యంచ, నందిగామ, మిట్టాపూర్, కోస్లీ,బినోలా తదితర గ్రామాలకు చెందిన పంట పొలాలను శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు ఇక రాయితీ చెల్లు

**● డిమాండ్ పెరగడంతో సబ్సిడీలు అవసరం లేదు**

**● కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**



**న్యూఢిల్లీ:** దేశంలో త్వరలో ఈవీల రేట్లు పెరిగే అవకాశం ఉంది. దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలకు ఇకపై ప్రభుత్వ రాయితీలు అవసరం లేదని తాజాగా భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వీటికి డిమాండ్ పెరగడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గడం వల్ల ఇకపై సబ్సిడీ అవసరం లేదన్నారు. ఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ సమ్మిట్‌లో గడ్కరీ ఈ మేరకు పేర్కొన్నారు. ప్రారంభ వ్యయం ఎక్కువగా ఉందని, అయితే డిమాండ్ పెరగడంతో ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ర్ వాహనాలు ఇప్పటికే అనుకూలమైన పన్నును అనుభవిస్తున్నా యని, కేవలం 5 శాతం మాత్రమే ఉందన్నారు. ఇది పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే చాలా ఎక్కువ ప్రయోజనాన్ని అందజేస్తుందని గడ్కరీ వెల్లడించారు. ఈ క్రమంలో సబ్సిడీ డిమాండ్ ఇకపై సమర్థించబడదని కేంద్ర మంత్రి భావించారు. ఈ నేపథ్యంలో క్లీన్ ఎనర్జీ వైపు విస్తృతంగా మారాలని గడ్కరీ సూచించారు. కానీ దేశంలో ఇంకా పెట్రోలు, డీజిల్‌పై భారతదేశం ఆధారపడటం ఒక ఆందోళనకర విషయమని గడ్కనీ అన్నారు. కానీ పెట్రోల్, డీజిల్ వాహనాలపై అదనపు పన్నులు విధించే అంశాన్ని ఆయన తిరస్కరించారు. ప్రజా రవాణాలో ఇ÷ఎల విస్తరణ గురించి ప్రస్తావించారు. పెట్రోల్ డీజిల్ వాహనాలపై ఆధార పడటం వల్ల కాలుష్య స్థాయిలు పెరుగుతున్నాయని, ఇలాంటి క్రమంలో ఎలక్ట్రిక్ర్ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రభుత్వం ఇయూ కంపెనీలకు ఇచ్చే సబ్సిడీ కారణంగా కొనుగోలుదారులు కొంత ప్రయోజనం పొందుతున్నారు. ఇకపై త్వరలో సబ్సిడీ ముగిస్తే ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులపై మోపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాహనం కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం వినియోగదారులకు తగ్గింపులను అందిస్తుంది. కంపెనీలు డిస్కౌంట్లను పొందడం ఆపివేస్తే, కస్టమర్లకు కూడా ఈ డిస్కౌంట్లను కంపెనీలు నిలిపివేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 40శాతం తగ్గింపు అందుబాటులో ఉంది. త్రీవీలర్లు, నాలుగు చక్రాల వాహనాలపై కిలోవాట్‌కు రూ.10,000 రాయితీ ఇస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న తాత్కాలిక ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ ముగియనుంది.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

● ఆరుగురు మావోలను మతమార్చిన పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజానావ:** ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని ప్రాంతాలు తుపాకీ మోతలతో దద్దరిల్లిపోతోంది. దంతెవాడ ఎన్కౌంటర్ మరువకముందే ములుగు జిల్లా సరిహద్దుల్లో మరో ఎన్కౌంటర్ జరిగింది. ములుగు, కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా సరిహద్దు దామెర తొడుగు అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా... మరి కొందరు గాయపడినట్టు తెలుస్తోంది. ఎదురుకాల్పుల ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. కరకగూడెం మండలం రఘునాథపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మృతుల్లో మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్న సహా ఆయన దళానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు గుర్తించారు. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. రఘునాథపాలెం ప్రాంతంలో గత కొంతకాలంగా ఈ దళం కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఈ దళానికి లచ్చన్న నాయకత్వం వహిస్తున్నారు. మృతుల్లో లచ్చన్నతో పాటు తులసి, శుక్రాం, రాము, దుర్గేష్, కోసి ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు గడ్డుకాలం ఉన్నట్టు ఉంది. వరుస ఎన్‌కౌంటర్లు వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పదిమంది వరకు మృతి చెందారు. ఇప్పుడు తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు హతమయ్యారు.

# బీజేపీ మాటలకు.. చేతలకు చాలా తేడా!



డబుల్ ఇంజన్ సర్కార్ కావాలి.. తెలంగాణలో తదుపరి తమదే ప్రభుత్వం అంటున్న బీజేపీ.. ప్రజలకు సేవలు అందించడంలో...వారి కష్టాల్లో పాలు పంచుకోవడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. కేవలం పడికట్టు పదాలు, గంభీర ఉపన్యాసాలతో కాలం గడిపేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ అతలాకుతలం అయ్యింది. అయినా పెద్దగా స్పందించలేదు. ఇంతకన్నా దారుణం, ఘోరం మరోటి ఉండదు. ఒక్కరు కాదు...ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. మరో ఆరుగురు ఎంపీలు ఉన్నారు. ప్రజలు వారిని నమ్మి గెలిపించారు. ఇలాంటి విపత్కర సమయంలో మేమున్నామని ముందుకు రాకపోవడం, అదంతా కాంగ్రెస్ తప్పిదమన్న రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం నిధులు ఉన్నాయి. ఖర్చు పెట్టుకోండని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓ ఉచిత సలహా పడేశారు. ఇకపోతే తెలంగాణ భారతీయ జనతా పార్టీ నాయకులు అసలైన విషయాలపై స్పందించడం లేదు. ముఖ్య నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ పరిమామం వల్ల అసలు బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు.


● రాష్ట్రం అతలాకుతలం అయినా పట్టింపులేని నేతలు

● విమర్శలు వస్తున్నా పట్టించుకోని నాయకగణం



**హైదరాబాద్, ప్రజానావ:** తాజాగా వరదల విషయంలో కేందాన్ని కాంగ్రెస్ పార్టీ పదేపదే సాయం కోరుతోంది. ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసింది. అవసరమైన హెలికాప్టర్లు, పవర్ బోట్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించలేదని ప్రజల్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటిని తెలంగాణ బీజేపీ నేతలు కూడా తిప్పి కొట్టలేకపోతున్నారు. మామూలుగా అయితే సాయం చేసి విమర్శలపై ఎదురుదాడి చేయవచ్చు . కానీ ఎవరికి వార తమకెందుకులే అనుకుంటున్నారు. అందు వల్లే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖమ్మంకు ఆ స్థాయిలో వరద వస్తుందని ప్రభుత్వం ఊహించలేకపోయింది. బుడమేరు విజయవాడను ముంచింది కాబట్టి... ఆ నీరు ఖమ్మం వైపు వస్తుందని అంచనా వేయలేకపోయారు. చివరికి మున్నేరు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. ఆరేడు అడుగుల ఎత్తున నీరు పారడం అంటే చిన్న విషయం కాదు. మామూలుగా అయితే గోదావరికి వరదలు వస్తే.. ఖమ్మం జిల్లా ఉలిక్కి పడుతుంది. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగ మున్నేరు ముంచేసింది. హెలికాప్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం విమర్శలు ఎదుర్కో వాల్సి వచ్చింది. తర్వాత రోజే రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రులు అక్కడే ఉండి సహాయ పునరావసా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ.. ప్రభుత్వం పెద్దగా ఏమ చేయలేదన్న విమర్శలను మూటగట్టుకుంది. అదే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. విపత్తు వచ్చినా కేంద్రం కనీసం హెలికాప్టర్ల పంపలేదని.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపలేదని రుజువు అయ్యింది. పక్కన ఉన్న ఆంధ్రాకు 120 పవర్ బోట్లు, హెలికాప్టర్లు, ఎయిర్ ఫోర్స్ కూడా సాయానికి వెళ్లింది. కానీ తెలంగాణకు ఎంతమాత్రం సాయం అందలేదు. అది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమేనని బీఆర్ఎస్ విమర్శించింది. ఇంత జరుగుతున్నా తమపై వస్తున్న విమర్శలకు బీజేపీ కౌంటర్ చేయలేకపోతోంది. దీనికి కారణం సమాధానం లేకపోవడం కాదు. నేతలు పెద్దగా పట్టించుకోకపోవడమే. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒక్క లీడర్ కూడా బాధ్యత తీసుకోవడం లేదు. మరీ ముఖ్యంగా వరద పరిస్థితుల్లో బిజెపి పూర్తిగా విఫలం అయ్యింది. కేవలం విమర్శలకే పరిమితం అయ్యింది. బిజెపిలోఎవరికి వారు సొంత ఎజెండా ప్రకారం స్పందించడం అలవాటు చేసుకున్నారు. అందుకే వారు కేంద్రాన్ని కూడా గట్టిగా నిలదీయడం లేదు.

# ఆశ..మనిషిని నడిపిస్తుంది !



## ఆధ్యాత్మికం

రేపటి రోజున సంతోషం పొంచి ఉందన్న ఆశతో జీవించాలి. అదే జీవన రహస్యం. అర్ధరాత్రి వేళ... భయానకంగా ఉరుమ-ుతూ మెరుస్తూ ఉంది. వాతావరణం. గాలీ, వాన! అప్పుడప్పుడూ మెరిసే వెలుగులో మాత్రమే పరిసరాలు కనిపిస్తున్నాయి. ఎక్కడో పిడుగు పడింది. క్షేమంగా క్షణం గడిస్తే చాలు, అన్నట్లుంది వాతావరణం. బిక్కుబిక్కుమంటూ ఓ పాకలో తల దాచుకున్నాడో ఒంటరి యాత్రికుడు. అయినా అతడి మస్తిష్కం వట్టిపోలేదు. ఆశాకిరణాలతో ప్రకాశమానంగా ఉంది. ఎందుకంటే ప్రస్తుత వాతావరణం భీతిగొల్పుతు న్నప్పటికీ... అది శాశ్వతం కాదు! కాసేపట్లో గాలివాన వెలుస్తుంది. ఇంకా కొన్ని ఘడియల్లో అలముకున్న కారుచీకటి సైతం వీడిపోతుంది. భానోదయం అవుతుంది. ప్రపంచం తేటపడుతుంది. దైనందిన వ్యాపకాలు ఊపందుకుంటాయి. అదే ప్రపంచ, జీవిత పోకడ! అదే ఆ యాత్రికుడికి తెలిసిన జీవన రహస్యం! అందుకే భవిష్యత్‌పై ఆశతో ఏకాగ్రతతో ఏదైనా పనిచేయాలి. ముందుగా దానిపై ఇష్టం పెంచుకోవాలి. దృఢమైన సంకల్పంతో మనిషి ఎప్పుడైతే సర్వశక్తుల్ని ఒక పనిమీద కేంద్రీకరిస్తాడో దాన్ని అప్పుడే అతడు విజయవంతంగా పూర్తి చేయగలుగుతాడు. ఏకాగ్రతకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. భక్తుడు ఎప్పుడైతే భగవంతుడి పట్ల ప్రేమను పెంచుకుంటాడో అప్పుడు అతడి మనసు భగవంతుడి గురించి ఆలోచించడం ప్రారంభిస్తుంది. ఎందుకంటే, మనం దేన్ని ప్రేమిస్తామో సహజంగా దానిమీదే మనసును ఏకాగ్రం చేస్తాం. మనసు దేనిపై ఏకాగ్రమవుతుందో దాని లక్షణాలే పుణికిపుచ్చుకొంటాం. భగవంతుడిపై మనసును ఏకాగ్రం చేసినప్పుడు భగవంతుడి లక్షణాలే జీర్ణించుకుంటాం. భగవద్గీత వాటినే దైవీ సంపద అని పేర్కొంది.

# విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

● విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ జివో విడుదల

● ఉపాధ్యాయ దినోత్సవంలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, ప్రజానావ:** విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు కూడా తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అలాగే విద్య నేర్పుతున్న గురువులకు ఈ ప్రభుత్వం అంతే ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవీంద్ర భారతిలో గురు పూజోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేశామని అన్నారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. 'ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వాళ్లైతే సమాజం కూడా అంత గొప్పగా మారుతుందని భట్టి విక్రమార్క అన్నారు. విద్యను, గురువులను గౌరవించేది కాంగ్రెస్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. మరో 6 వేల ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27, 862 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఇవాల్టి నుండే అమలు చేస్తున్నామని.. జీవో కూడా విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉందని.. అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాంను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు , ఎమ్మెల్యేలు కోదండరాం, నర్సిరెడ్డి, రఘోత్తం రెడ్డి , ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్లు దేవసేన , శృతి ఓజా , ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ముంపు ప్రాంతాల్లో కేంద్రమంత్రి ఏరియల్ సర్వే

### మంత్రివెంట లోకేశ్ కూడా పరిశీలన

**అమరావతి, ప్రజానావ:** విజయవాడలో వరద ముంపుతో నష్టపోయిన ప్రాంతాలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పరిశీలించారు. ఏరియల్ సర్వే ద్వారా బుడమేరు, క్యాచ్‌మెంట్ ఏరియాలను పరిశీలించారు. అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి మిల్క్ ఫ్యాక్టరీ, కండ్రిక, అజిత్‌సింగ్ నగర్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి నివాసంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరద కారణంగా దెబ్బతిన్న ప్రకాశం బ్యారేజీ గేట్లను పరిశీలించనున్నారు. అనంతరం జక్కంపూడి కాలనీ మిల్క్ ఫ్యాక్టర్టీ ప్రాంతాన్ని ఎన్డీఆర్ఎఫ్ బోట్‌లో వెళ్లి పరిశీలించనున్నారు. విజయవాడ కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి తిలకించనున్నారు. గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులు కేంద్రమంత్రికి స్వాగతం పలికారు.

## పవన్ కళ్యాణ్‌కు స్వల్ప అస్వస్థత

### జ్వరంతోనే అధికారులతో సమీక్ష

**అమరావతి,సెప్టెంబర్ 5 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. వైరల్ జ్వరం, దగ్గుతో బాధ పడుతున్నారు. అయినా, వరద ప్రాంతాల్లోని పారిశుధ్య నిర్వహణపై పవన్ తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద నీరు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, సూపర్ క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం, దోమల బెడద తీవ్రత ఉన్నందున పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. అనంతరం ఏలేరు రిజర్వాయర్‌కి వరద ముప్పుపై ఆరా తీశారు.

## సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● వారి ప్రోత్సాహంతోనే ఇంతటి వారం అయ్యాం ● వరంగల్ ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ, ప్రజానావ:** సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటే గురువులు ఎంతో సంతోషపడతారని పేర్కొన్నారు. ప్రతి విజేత కూడా తన విజయానికి కారణం గురువులే అని చెబుతుంటారని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను మరింత మెరుగు పరిచే విధంగా గురువులు తోడ్పాటునందించి ఉన్నత స్థాయికి చేరడంలో కృషి చేస్తారన్నారు. కరోనా సమయంలో పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులను సమగ్ర మూర్తిమత్వంతో గురువులు తీర్చిదిద్దా లన్నారు. ఈ సందర్భంగా గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నవారికి అభినందనలు తెలియజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల సహకారం కూడా ఎంత ఉందన్నారు. రాబోయే రోజులలో కొత్త వరంగల్ ను చూడబోతున్నారని తెలిపారు. కొత్త వరంగల్ ను చూడడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించు కున్నామని పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా సభాధ్యక్షత వహించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే అది ఉపాధ్యాయులతోనే సాధ్యమని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ వర్గాలు ఉపాధ్యాయుల పైన ఎంతో నమ్మకం కలిగి ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులు చేసే సేవలను కొలువలేమని , సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందన్నారు. గురువులు అందించిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయిలో మీ ముందున్నానని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఈ స్థాయిలో ఉండడానికి తన గురువులే కారణమని తెలిపారు. తాను డాక్టర్ అవుదామని అనుకున్నానని, కానీ కాలేకపోయానని చెప్పారు. తన గురువు కొమురయ్య జాతీయస్థాయి లో క్రీడాకారునిగా రాణించేలా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. సమాజంలో ఎవరి నుంచి ఏమీ ఆశించని ఉద్యోగం ఏదైనా ఉందంటే అది ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని అన్నారు. అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించే వారే గురువులని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించే విద్యనే అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు . జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరాయని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని, ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్రగతి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి వివరించారు. ఉత్తమ పనితీరుతో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 31మంది ఉపాధ్యాయులను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందనలు తెలియజేశారు. హనుమకొండ లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల విద్యార్థులు చేసిన స్వాగతం నృత్యం, పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిందే



### త్రివిధ దళాలకు రాజ్‌నాథ్ సింగ్ ఆదేశం

**లక్నో:** శాంతిని కాపాడాలంటే సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. లక్నోలో ఏర్పాటు చేసిన త్రివిధ దళాల కమాండర్ల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రష్యా-ఉక్రెయిన్, గాజా సంక్షోభాలతోపాటు బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులను విశ్లేషించాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేసుకోవడంతోపాటు ఊహించని పరిణామాలను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. భారత్ శాంతి కోరుకునే దేశమని, దీన్ని కాపాడుకోవాలంటే సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. వాస్తవాధీన రేఖ వెంట నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావించిన ఆయన.. శాంతి, స్థిరత్వానికి ఉత్తర సరిహద్దు, పొరుగుదేశాల్లో నెలకొన్న పరిస్థితులు సవాల్ విసురుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సైన్యాధికారులు విస్తృత, లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# విమర్శించడమే వాళ్ల పని

- వరదలపై బీఆర్ఎస్ బురద రాజకీయాలు
- ఎక్స్ ఖాతాలో విషం చిమ్ముతున్న కేటీఆర్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం



**హైదరాబాద్, ప్రజానావ:** వరదలపై బీఆర్ఎస్ పార్టీ బురద రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపణలు చేశారు. వరద కష్టాల్లో కూడా కల్వకుంట్ల కుటుంబానికి రాజకీయాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్ సీఎల్పీ మీడియా హాల్లో ఆది శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులకు పనిగా మారిందని మండిపడ్డారు. అనుకోని విపత్తు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా విమర్శలు చేస్తారా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.సహాయక చర్యలపై ప్రభుత్వానికి సలహా, సూచనలు ఇవ్వ కుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ అమెరికాలో ఎంజాయ్ చేస్తూ ట్విట్టర్‌లో విషం చిమ్ముతున్నారని ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ అడ్రస్ ఇప్పటి వరకు తెలియదని ఆక్షేపించారు. కేసీఆర్ ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో ఉన్నారా లేక నంది నగర్‌లో ఉన్నారా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. వరద బాధితుల కుటుంబాలకు కనీసం సంతాపం కూడా తెలపనంత బిజీగా కేసీఆర్ ఉన్నారా అని ప్రశ్నించారు. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి కూడా నోరు రావడం లేదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుని మాజీ మంత్రి హరీష్‌రావును జనం పైన దాడికి పంపించారని ఆది శ్రీనివాస్ విమర్శలు చేశారు. ఖమ్మంలో బాధితులను పరామ ర్శించకుండా హరీష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. హరీష్?రావు వైఖరి కారణంగా అక్కడ గందరగోళం చోటు చేసుకుందని చెప్పారు. హరీష్‌రావు నోరు తెరిస్తే రాజకీయం తప్ప మరొకటి లేదని ఆక్షేపించారు. గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు విదేశీ కుట్ర అని కేసీఆర్ తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. క్లౌడ్ బర్స్ట్ ద్వారా భారీ వర్షాలు కురిపిస్తున్నారంటూ నోటికొచ్చినట్లు అబద్దాలు చెప్పారని విమర్శించారు. ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం అంటూ కొడుకు, అల్లుడుతో కేసీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని ఆది శ్రీనివాస్ ౹÷ర్ అయ్యారు. గత పదేళ్లలో చాలాసార్లు వరదలు వచ్చినప్పుడు పరిహారం ఇవ్వకుండా పచ్చి మోసం చేశారని విమర్శలు చేశారు. గతంలో హైదరాబాద్?లో వరదలు వచ్చినప్పుడు ఇంటికి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని బాధితులను కేసీఆర్ దగా చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు తీసుకువచ్చే ధైర్యం బీఆర్ఎస్ నేతలకు ఉందా అని సవాల్ విసిరారు. ప్రజలపై అంత ప్రేమ ఉంటే మాజీ మంత్రి కేటీఆర్ 18 గంటల్లో అమెరికా నుంచి రావొచ్చు కదా అని ఆది శ్రీనివాస్ సవాల్ విసిరారు. ప్రభుత్వం సహాయక చర్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేస్తున్నామని అన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ. 10 వేలు ఇస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ఇంటికి రూ. 10 వేల తక్షణ సాయం అందిస్తున్నామని ప్రకటించారు.

చనిపోయిన గేదెలు, గొర్రెలు, మేకలకు కూడా సాయం అందజేస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన ఈర్ష్యతోనే ఏపీ సీఎం చంద్రబాబు బాగా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశంసిస్తున్నారని అన్నారు. కేంద్రం నుంచి తక్షణ సాయం రూ. 20, 000 కోట్లు ఇవ్వాలని అడిగామని.. కానీ కేంద్రమంత్రులు సోది కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి ప్రయోజనం లేకుండా పోయిందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం విషయంలో పొరపాటు జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే వేముల పట్ల అమర్యాదగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.



# వరదబాధితులకు చిత్ర పరిశ్రమ అండ

- ఇరు రాష్ట్రాలకు 25 లక్షల చొప్పున సాయం
- నిర్మాత సురేశ్ బాబు కోటి సాయం ప్రకటన
- దిల్ రాజు 25 లక్షల సాయం ప్రకటన
- థియేటర్ల వద్ద విరాళాల సేకరణకు ఏర్పాట్లు

**హైదరాబాద్, ప్రజానావ:** తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం తెలుగు చిత్ర పరిశ్రమ కీలక నిర్ణయం తీసుకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇబ్బందులపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వెల్లడించింది. కమిటీ ఇచ్చే సమాచారం మేరకు సహాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొంది. అన్ని థియేటర్ల వద్ద విరాళాలు, వస్తువుల సేకరణ కోసం సెంటర్ ఏర్పాటు చేయనుంది. మరోవైపు, ఫిల్మ్ ఛాంబర్‌తోపాటు పలువురు నిర్మాతలు వ్యక్తిగతంగా విరాళాలు ప్రకటించారు. బాధితుల సహాయార్థం రెండు రాష్ట్రాలకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ చెరో రూ.25 లక్షలు, తెలుగు నిర్మాతల మండలి చెరో రూ.10 లక్షలు, ఫిల్మ్ ఫెడరేషన్ ఇరు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల విరాళం ఇస్తున్నట్టు తెలిపాయి. దగ్గుబాటి కుటుంబం తరఫున ఇరు రాష్ట్రాలకు నిర్మాత సురేశ్ బాబు రూ. కోటి, దిల్ రాజు ఇరు రాష్ట్రాలకు చెరో రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఫిల్మ్ ఛాంబర్‌లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ మాట్లాడు తూ.. ఇలాంటి విపత్తుల సమయంలో సాయం చేసేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా మన పరిశ్రమ చేయూత అందిస్తుంటుంది. అండగా ఉంటుంది. ధనమే కాకుండా నిత్యావసరాలు అందించే ప్రయత్నం చేస్తాం. ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం అని నిర్మాత సురేశ్ బాబు తెలిపారు. దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ..మేం ఈ స్థాయికి రావడానికి కారణం ప్రజల ఆదరణెళి. ఇప్పుడు వాళు కష్టాల్లో ఉన్నారు. ఇలాంటి సమయంలో మనం వాళ్లను ఆదుకోవాలి. అలాగే మాకు ఎప్పుడూ అండగా ఉండే ప్రభుత్వాలకు మద్దతును తెలియజేయడానికే ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశాం అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు ఇప్పటికే చాలామంది హీరోలు విరాళాలు అందించారు. ఛాంబర్ తరఫున సాయం చేయాలని నిర్ణయించాం. ఇండస్ట్రీలోని అందరూ ముందుకు వచ్చి ఫెడరేషన్ నంబరుకు విరాళాలు అందించాలని కోరుతున్నాం. వచ్చిన విరాళాలను ప్రభుత్వాలకు అందిస్తాం అని నిర్మాత దిల్ రాజు అన్నారు. ఫిల్మ్ ఇండస్టీ ఎంఎ÷-లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ..రేపు అన్ని యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నాం. ఒక రోజు వేతనం ఇచ్చేలా ఎ÷-లాన్ చేస్తున్నాం'అని వివరించారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ..'వరద బాధితులను ఆదుకోవడం కోసం ఇండస్టీ నుంచి ఒక కమిటీ ఏర్పాటు చేశాం. తెలుగు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎవరికి ఏ ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని కమిటీ వాటిని పరిష్కరించేలా ముందుకు వెళ్తుంది' అని పేర్కొన్నారు. సమావేశంలో భరత్ భూషణ్, ప్రసన్న కుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్, అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.






## అనాథాశ్రమంలో అన్నదానం

**వరంగల్, ప్రజానావ:** మృదు స్వభావి, స్నేహశీలి, నిరంతర సేవాభావం కలిగిన కీ.శే. శ్రీగిరిరాజు జగన్మోహన్ రావు (హైదారాబాద్) మూడో వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు, లార్డ్ సంస్థ నిర్వాహకులు గురువారం భీమారంలోని లార్డ్ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించి టవల్స్, ట్రిమ్మర్లను అందజేశారు. వీరితో పాటు పలువురు నిరుపేదలకు నగదు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు లార్డ్ సంస్థ నిర్వాహకులు నారగోని నరేశ్, స్థానిక ఏకశిల కరోకే క్లబ్ సభ్యులు అనిశెట్టి స్వప్న, రెహమాన్, సుధాకర్, రామాచారి, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం, ములుగు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. రఘు, స్వామి, శ్రీనివాస్ పాల్గొనగా, ప్రగల్లపాటి ప్రకాశం ఫౌండేషన్ బాధ్యులు రాజ్ కుమార్, రేవతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ



**అమరావతి, ప్రజానావ:** ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఆంధ్రా ప్రజలకు వాతావరణ శాఖ మరో షాకింగ్ న్యూస్ చెప్పింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని.. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ అల్పపీడనానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందన్నారు. అల్పపీడనం ఉత్తర దిశగా పయనిస్తోందని చెప్పారు. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు. అక్కడక్కడ మాత్రం భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా మన్యం, అల్లూరి, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కోనసీమ, ఎన్టీఆర్, కృష్ణా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలన్నారు. ఇదిలాఉంటే.. గడిచన 24 గంటల్లో అనకాపల్లిలోని చోడవరంలో 11 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాంధ్రలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఉత్తరాంధ్ర తీరంలో రానున్న మూడు రోజులు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా వేటకు వెళ్లినట్లయితే.. వెంటనే తిరిగి రావాలని సూచించారు.

## అదుపు తప్పి కాలువలో బోల్తాపడ్డ లారీ

**నిజామాబాద్, ప్రజానావ:** లారీ అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి-అకోలా జాతీయ రహదారిపై డెగ్లూర్ తాలూకా, కోకల్‌గావ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని లారీలో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని పిట్లం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



# చిట్యాలలో హెలిక్యాప్టర్ ల్యాండ్

### ఫోటోలు దిగి సందడి చేసిన కూలీలు

**నల్లగొండ, ప్రజానావ:** ఆకాశంలో ఎక్కడో చిన్న పక్షి మాదిరిగా. కనిపించే హెలికాప్టర్ అకస్మాత్తుగా వచ్చి పక్కనే ల్యాండ్ అయితే?.. ఎలా ఉంటుందో ఊహించగలరా!!. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన రైతు కూలీలకు ఇదే అనుభవం ఎదురైంది. విజయవాడ నుంచి హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కి వెళ్తున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి చెందిన హెలికాప్టర్ ఒకటి నల్గొండ జిల్లాలో ఎమ్జ్గ÷న్సీ ల్యాండింగ్ అయింది. సాంకేతిక సమస్య కారణంగా ఉన్నట్టుండి పంట పొలాల్లోనే ల్యాండ్ చేయాల్సి వచ్చింది. చిట్యాల శివారు ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. హెలికాప్టర్‌లోని ముగ్గురు అధికారులు సురక్షితంగా ఉన్నారు. సమాచారం మేరకు మరికాసేపటికే మరో హెలికాప్టర్ వచ్చి అధికారులను అక్కడి నుంచి తరలించింది. అయితే పంట పొలంలో హెలికాప్టర్ ల్యాండ్ అవడంతో అక్కడి రైతులు, రైతు కూలీలు అందరూ ఆశ్చర్యపోయారు. హెలికాప్టర్‌ను ఆసక్తిగా చూశారు. హెలికాప్టర్ ముందు ఫోటోలు కూడా దిగారు. కూలీలు హెలికాప్టర్ ముందు కూర్చుని ఫోటోలు దిగారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్‌గా మారాయి. కాగా రైతు కూలీలు సాధారణంగా హెలికాప్టర్లు, విమానాలను చూడడం అరుదుగా జరుగుతుంటుంది. మరీ ఇంత దగ్గర నుంచి చూసే అవకాశం మాత్రం అందరికీ రాదు. రోజువారీ పనుల్లో బిజీబిజీగా వారు తమకు అంత దగ్గరకు హెలికాప్టర్ రావడం చూసి తెగ సంబరపడ్డారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ

**చందుర్తి ప్రజానావ:** చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దప్పుల అశోక్ కు ఇటీవల కూతురు పుట్టి అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను మరియు మూడపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన జువ్వాడి సత్యనారాయణ రావు కుటుంబ సభ్యులను అలాగే చందుర్తి మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు చిలుక పెంటయ్యను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. వారి వెంట కేడీసీసీ డైరెక్టర్ కిషన్ రావు, మండల అధ్యక్షుడు మ్యకల ఎల్లయ్య , సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, అనిల్ రావు, అంజిబాబు, రమేష్ రావు, బాబు, తిప్పని శ్రీనివాస్, వెంకటేష్, తిప్పని శ్రీనివాస్, బత్తుల కమలాకర్, రవి, గంగాధర్, ఆనందం, మల్లిక్, కమలాకర్, నగేష్, రమేష్ రావు చిలువేరి రవి, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

## బాలికలకు పోక్సోపై అవగాహన సదస్సు

**ముస్తాబాద్, ప్రజానావ:** సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలెం గూడెం, కొండాపూర్ గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సఖి సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలు, పొక్సో లపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సఖి సెంటర్ కౌన్సిలర్ అంజలి విద్యార్థులతో మాట్లాడుతూ సఖి అందిస్తున్న సేవలు ఉద్దేశం గురించి తెలియజేస్తూ వరకట్నం, గృహహింస, లైంగిక వేధింపుల గురించి వివరిస్తూ విద్యార్థులకు, మహిళలకు పనిచేసే చోట లైంగిక వేధింపులు, స్త్రీల, బాలికల అక్రమ రవాణా అమ్మకాల పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి తెలియజేశారు. పోక్సో చట్టం, బాలల హక్కులు గురించి విద్యార్థులకు అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మూస్తాబాద్ ఎస్సై గణేష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రోన్ సాయంతో గడ్డిమందు పిచికారీ




**సిరిసిల్ల, ప్రజానావ:** సిరిసిల్ల పట్టణ పరిధి శాంతినగర్, శ్రీనగర్ కాలనీలోని ఓపెన్ స్పేస్‌లో పిచ్చి మొక్కలు, తుంగపై డ్రోన్ సాయంతో గడ్డి మందు పిచికారీ చేశారు. ఈ పిచ్చిమొక్కలు సాధారణ పద్ధతిలో తొలిగించలేని పరిస్థితి నెలకొనడంతో వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో డ్రోన్ ఉపయోగించి గడ్డి మందు పిచికారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పారిశుధ్య సిబ్బంది, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత



**సిరిసిల్ల, ప్రజానావ :** సిరిసిల్ల పట్టణం గాంధీనగర్ ఉన్న మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ బిల్డింగ్ అక్రమ నిర్మాణం అని కోర్టు తీర్పు చెప్పడంతో గురువారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సెల్లార్‌ను కూలగొట్టారు. ఈ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు.

## వారసిగూడలో జిమ్ ప్రారంభం



**సికింద్రాబాద్, ప్రజానావ :** సికింద్రాబాద్‌లోని వారసిగూడలో కొత్తగా ఏర్పాటైన 'హల్క్ జిమ్'ను గురువారం సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం సరసమైన ధరలకే జిమ్ లను నిర్వహించడం ద్వారా లాభాపేక్ష రహిత కార్యకలాపాలను నిర్వహించాలని సూచించారు. కార్పొరేటర్ సామల హేమ, నిర్వాహకుడు కిషోర్, నాయకులు పాల్గొన్నారు.





# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలి
- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**సిరిసిల్ల, ప్రజానావ:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ళ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖాళీల భర్తీకి ఇటీవల దాదాపు 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించిందని గుర్తు చేశారు. పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. హౌ అమ్మ ఆదర్శ పాఠశాల కింద స్కూళ్ళలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకొని 10/10 సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి సన్మానించారని గుర్తు చేశారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల ప్రమోషన్స్, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి రాష్ట్రపతి, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఇంజనీర్లు ఇలా ఎదిగిన వారు ఉన్నారని గుర్తు చేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్స్ స్వీకరించిన వారికి అభినందనలు తెలియజేశారు. మిగితా టీచర్లు వీరిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి తాడురి సంపత్ కుమార్, రాష్ట్ర స్థాయికి పాకాల శంకర్ ఎంపిక కాగా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి వారు ఎంచుకున్న రంగంలో రాణి%శి%చేలా టీచర్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయులు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విప్ కోరారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. తన బాల్యం నుంచి ఈ స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దిన టీచర్లు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను అన్ని అంశాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక, పర్యావరణ స్పృహ, నైతికత, విలువలు, పోటీతత్వం నేర్పించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ ఛైర్పర్సన్ జిందం కళా, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా విద్యాధికారి రమేష్, జీసీడీఓ పద్మజ ఎంఈఓలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్వేషపూరిత పోస్టులపై చర్యలు

### సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, ప్రజానావ:** సామాజిక మాధ్యమాలు ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ తదితర వాటిలో మతవిద్వేషాలకు సంబంధించిన ఫేక్ మెసేజ్ లు, వీడియోలు పోస్టు చేసినా, ఫార్వార్డ్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే, పోస్ట్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు ఎలాంటి ఉద్వేగాలకు లోనూ కాకుండా సంయమనం పాటిస్తూ శాంతి భద్రతల సంరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని ఒక ప్రకటనలో ఎస్పీ తెలిపారు.





## మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయాలి

**రాజన్న సిరిసిల్ల, ప్రజానావ:** పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో తయారు చేసిన 2 వేల మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదయంలోని తన ఛాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, ఆయా గ్రామాల్లో విగ్రహాలు పంపిణీ చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ భిక్షపతి, జీఎం ఇండస్ట్రీస్ భారతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సదరమ్ శిబిరానికి నిర్ణీత సమయానికి రావాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సిరిసిల్ల, ప్రజానావ:** సదరమ్ శిబిరంలో వైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత సమయానికి రావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాహసూచించారు. సదరమ్ శిబిరం నిర్వహణ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థో, వినికిడి, కంటి, మానసిక అనారోగ్యం శిబిరాలు నిర్వహించే ఏర్పాట్లపై చర్చించారు. ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలు సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వేములవాడ ఏరియా హాస్పిటల్ లో ఈ నెల 10వ తేదీన, 13వ తేదీన, 18వ తేదీన, 20 వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి వైకల్యం నిర్ధారణ పరీక్షలు సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో, వేములవాడ ఏరియా హాస్పిటల్ లో ఈ నెల 24 వ తేదీన నిర్వహించనున్నట్లు వివరించారు. వినికిడి, మానసిక అనారోగ్య వైకల్యం నిర్ధారణ పరీక్షలు ఈ నెల 27 వ తేదీన సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని దరఖాస్తుల దారుల సౌకర్యార్థం స్థానిక దవాఖానల్లో శిబిరాలు సిరిసిల్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు, వేములవాడలో మధ్యాహ్నం 02.00 గంటల నుంచి 05.00గంటల దాకా నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆర్థో, వినికిడి, కంటి, మానసిక అనారోగ్యం వైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల నుంచి దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీఎంహెచ్ఓ వసంతరావు, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్లు లక్ష్మీనారాయణ, పెంచలయ్య, ఆర్ఎంఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మూగ జీవాల వేదనను తీర్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, ప్రజానావ:** విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న సుమారు 20 ఆవులు, కోడెలను ఒకదగ్గరికి చేర్చి, విపరీతంగా పెరిగిన వాటి డెక్కలను వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది తొలగించారు. మూగజీవాల వేదనను తీర్చిన విప్ఆది శ్రీనివాస్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన చల్లని మనసును పలువురు కీర్తించారు. దీనిపై పట్టణ ప్రజలు, హిందూ సంఘాల నాయకులు, గో సంరక్షకులు, జంతు ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు.

## మట్టి గణపతులను పూజించాలి

**సికింద్రాబాద్, ప్రజానావ:** పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను కల్పించాల్సి ఉందని, ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమని గుర్తించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లో చేపట్టిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సీతాఫలమండీలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మట్టి వినాయకులను బల్దియా అధికార యంత్రాంగం తయారు చేయించి ఉచితంగా అందించడం ఆనందకరమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, ప్రజానావ:** ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సహకరిస్తే, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని భూపాలపల్లి కలెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈరోజు గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని ఐడివోసీ మీటింగ్ హాల్ లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. మనం చదువు చెప్పే పిల్లల భవిష్యత్ మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ఎంత విజ్ఞానవంతులైన విద్యార్థులను తయారు చేస్తే సమాజం అంత బాగుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బడుగు, బలహీన వర్గాల వారే ఉంటారని, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఒకపేద కుటుంబం ఉన్నత కుటుంబంగా ఎదగాలంటే చదువు ఎంతో ముఖ్యమని, అలాంటి పేద విద్యార్థులకు ఉపాధ్యాయులే మంచి మార్గాన్ని చూపెట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకోసం ప్రభుత్వం ఎన్ని కోట్ల నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పాఠశాలను దేవాలయాలుగా తీర్చిదిద్దాలని, ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతిస్తుందని, ప్రభుత్వ లక్ష్యం, ఆశయం మేరకు మనందరం మెరుగైన సమసమాజభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కొంతవరకు పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేశామని, పాఠ్య పుస్తకాలు, యూనిఫార్మ్ ఇచ్చామని పేర్కొన్నారు. మన జిల్లా మెరుగైన విద్యకు నాంది కావాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టి తీసుకురావాలని పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్లు ఇస్తే వాటిలో 3 కోట్ల 70 లక్షల గురుకుల పాఠశాలల అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యతని ఎన్ని నిధులైనా ఖర్చు చేసే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తరువాత గురువులకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. తన తల్లిదండ్రులు ఇద్దరు గురువులేనని అన్నారు. ఉపాధ్యాయులు ఎంతో విజ్ఞాన వంతులని సమజానికి దిక్సూచి అని అన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి రోల్ మోడల్ అని, విద్యార్థుల భవిష్యత్ తరగతిలో తీర్చి దిద్దే గురువుల రుణం ఎప్పటికి తీర్చుకోలేమని అన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 37 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



# హైదరాబాద్ టీమ్‌కు జగన్‌మోహన్ రావు అభినందనలు

**హైదరాబాద్, ప్రజానావ:** తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్లో హైదరాబాద్ జట్టు అద్భుత ఆటతీరుతో ఫైనల్లో ప్రవేశించింది. గురువారం ముగిసిన సెమీస్ పోరులో టీఎన్‌సీఏ ప్రెసిడెంట్స్ లెవన్‌పై హెచ్సీయే మధ్య జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు 64 పరుగుల తేడాతో గెలిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్ టీమ్ సభ్యులకు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అర్శనపల్లి జగన్‌మోహన్ రావు స్వయంగా ఫోన్ చేసి, అభినందించారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఈ టోర్నీలో ఫైనల్ చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్‌లో అద్భుతంగా ఆడి, హైదరాబాద్‌కు కప్‌తో తిరిగిరావాలని క్రికెటర్లకు సూచించారు. ఫైనల్స్ వచ్చే ఆదివారం మొదలవనుంది.

## బీజేపీలో చేరిన క్రికెటర్ రవీంద్ర జడేజా



**న్యూఢిల్లీ:** క్రికెటర్ రవీంద్ర జడేజా భారతీయ జనతా పార్టీ(బీజేపీలో) చేరారు. సెప్టెంబర్ 2న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన ఫోటోని రవీంద్ర జడేజా భార్య, బీజేపీ ఎమ్మెల్యే రివాబా జడేజీ పంచుకున్నారు. రవీంద్ర జడేజా బీజేపీలో చేరినట్లు ఆమె ఫోటోని పోస్ట్ చేశారు. మెంబర్‌షిప్ డ్రైవ్‌ను ఇటీవలే బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ప్రారంభించారు, ఆయన సెప్టెంబర్ 2 న ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీని సభ్యునిగా చేర్చుకున్నారు.రివాబా 2019లో బీజేపీలో చేరారు. ఆమె 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్ నగర్ నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. ఆమె ఆప్ అభ్యర్థి కర్షన్ భాయ్ కర్మ్మార్‌ని ఓడించారు.

## స్టన్నింగ్ డెలివరికి నితీశ్ రెడ్డి క్లీన్‌బౌల్డ్



**న్యూఢిల్లీ:** భారీ అంచనాల మధ్య దులీప్ ట్రోఫీలోకి బరిలోకి దిగిన తెలుగు కుర్రాడు, యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి నిరాశపరిచాడు. ఇండియా-బీ తరఫున ఆడుతున్న నితీశ్.. ఇండియా-ఏతో జరుగుతున్న మ్యాచ్‌లో గోల్డెన్ డకౌటయ్యాడు. ఆర్సీబీ బౌలర్ ఆకాశ్ దీప్ వేసిన స్టన్నింగ్ డెలివరీని ఎదుర్కోవడంలో విఫలమయ్యాడు. కీలక సమయంలో తన వికెట్‌ను చేజార్చుకున్న నితీశ్ రెడ్డి పరోక్షంగా జట్టును తీవ్ర కష్టాల్లోకి నెట్టాడు. భవిష్యత్ స్టార్ ఆల్‌రౌండర్‌గా పేరొందిన నితీశ్ రెడ్డి ఇటీవల జింబాబ్వే పర్యటనకు ఎంపికైన విషయం తెలిసిందే. అయితే 21 ఏళ్లకే టీమిండియాలో ఆడే అవకాశం వచ్చిందని సంతోషించేలోపే నితీశ్‌కు చుక్కెదురైంది. గాయం అతన్ని జింబాబ్వే టీ20 సిరీస్ నుంచి దూరం చేసింది. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌కు నితీశ్ ఎంపిక కాలేదు. అయితే నితీశ్‌ను మరో హార్దిక్ పాండ్యగా చేయాలని బీసీసీఐ భావించి, అతని గాయం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించింది. దులీప్ ట్రోఫీకి నితీశ్‌ను ఎంపిక చేసినప్పటికీ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే ఇండియా-బీకి అందుబాటులో ఉంటాడని బీసీసీఐ స్పష్టం చేసింది. అయితే తిరిగి కోలుకున్న నితీశ్ భారీ అంచనాల మధ్య ఇవాళ బరిలోకి దిగాడు. కానీ బ్యాటర్‌గా విఫలమయ్యాడు. అయితే రిషభ్ పంత్ (7బీ 10 బంతుల్లో, 1 ఫోర్) ఔటైన అనంతరం క్రీజులోకి వచ్చిన నితీశ్ తొలి బంతికే ఔటవ్వడంతో జట్టు ఒత్తిడిలోకి వెళ్లింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న ఇండియా-బీ జట్టు 33 పరుగులకే కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (13బీ 42 బంతుల్లో, 1 ఫోర్) వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత క్రమంగా యశస్వీ జైస్వాల్ (30బీ 59 బంతుల్లో, 6 ఫోర్లు), సర్ఫరాజ్ ఖాన్ (9బీ 35 బంతుల్లో, 1 ఫోర్) కూడా ఔటయ్యారు. అయితే ఆదుకుంటాడనుకున్న పంత్.. గిల్ అద్భుతమైన క్యాచ్‌కు వెనుదిరిగాడు. దీంతో నితీశ్ నిదానంగా ఆడి జట్టును కాపాడే పరిస్థితి ఏర్పడింది. కానీ ఆకాశ్ దీప్ చక్కని బంతికి తెలుగు ఆల్‌రౌండర్ వెనుదిరిగడం బీ-జట్టుపై తీవ్ర ప్రభావం చూపించింది. కాగా, ప్రస్తుతం బీ జట్టు 89 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.




## యూఎస్ ఓపెన్‌లో అమెరికన్ల హవా..

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ 2024లో అమెరికన్ల హవా సాగుతోంది. అమెరికా ప్లేయర్ ఎమ్మా నవారో ఇప్పటికే సెమీస్‌కు చేరగా.. ఆరో ర్యాంకర్ జెస్సికా పెగులా కూడా సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ వన్ ఇగా స్వైటెక్ (పొలాండ్)ను జెస్సికా ఓడించింది. స్వైటెక్‌పై 6-2, 6-4తో వరుస సెట్లలో పెగులా విజయం సాధించింది. పెగులా దాటి ముందు స్వైటెక్ నిలవలేకపోయింది. సెమీస్‌లో స్టార్ క్రీడాకారిణి కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్ )తో తలపడనుంది. మరో సెమీస్‌లో ఎమ్మా నవారో (అమెరికా) రెండో సీడ్ అరియానా సబలెంక (బెలారస్)ను ఢీకొట్టనుంది. జెస్సికా పెగులాకు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ కావడం విశేషం. సెమీఫైనల్ మ్యాచులలో నవారో, పెగులా గెలిస్తే.. ఈసారి యూఎస్ ఓపెన్ విజేతగా అమెరికన్ క్రీడాకారిణే నిలవనుంది. గతేడాది యూఎస్ ఓపెన్‌ను కొకో గాఫ్ గెలిచిన విషయం తెలిసిందే. పురుషుల సింగిల్స్‌లో టాప్ ర్యాంకర్ సినర్ (ఇటలీ) సెమీస్‌కు దూసుకె ళ్లాడు. క్వార్టర్స్‌లో మెద్వెదెవ్ (రష్యా)పై 6-2, 1-6, 6-1, 6-4తో విజయం సాధించాడు. ఇప్పటికే నోవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాస్ లాంటి స్టార్ ఆటగాళ్లను ఓడించిన సినర్.. యూఎస్ ఓపెన్ 2024లో టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. సెమీస్‌లో జాక్ డ్రేపర్ (బ్రిటన్)తో సినర్ తలపడనున్నాడు.

## ముషీర్ ఖాన్ సంచలన ఇన్నింగ్స్..



**న్యూఢిల్లీ:** టీమిండియా క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ గురించి క్రికెట్ లవర్స్‌కు బాగా తెలుసు. అన్నలా భారత జట్టులోకి వచ్చి సత్తా చాటాలని తహతహ లాడుతున్న ఈ యంగ్ సెన్సేషన్ డొమెస్టిక్ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. తనకు అవకాశం వచ్చిన ప్రతిసారి దుమ్మురేపుతు న్నాడు. తాజాగా మరోమారు అతడు తన ప్రతాపం చూపించాడు. దులీప్ ట్రోఫీ-2024 ఫస్ట్ డేనే ఈ కుర్రాడు బ్యాట్‌తో వీరవిహారం చేశాడు. ఇండియా ఏతో జరుగుతున్న మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కాడు. సోదరుడు సర్ఫరాజ్ ఖాన్ (9) సహా యశస్వి జైస్వాల్ (30), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (13), రిషబ్ పంత్ (7), నితీష్? కుమార్ రెడ్డి (0) లాంటి స్టార్లంతా విఫలమైన చోట ముషీర్ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. ప్రత్యర్థి జట్టులో స్టార్ బౌలర్లు ఉన్నా లెక్కచేయకుండా జూలు విదిల్చి బ్యాటింగ్ చేశాడు. 94 పరుగులకే 7 మంది బ్యాటర్లు ఔట్ అయ్యారు. ప్రత్యర్థి జట్టులో ఖలీల్ అహ్మద్, ఆకాశ్‌దీప్, ఆవేశ్ ఖాన్, కుల్దీప్ యాదవ్ లాంటి టీమిండియా స్టార్ బౌలర్లు ఉన్నారు. అయినా ముషీర్ తొణకలేదు, బెణకలేదు. తన బ్యాటింగ్ తాను చేసుకుంటూ పోయాడు. మారథాన్ ఇన్నింగ్స్ ఆడిన అతడు 222 బంతుల్లో 10 బౌండరీలు, 2 సిక్సుల సాయంతో 105 పరుగులు చేశాడు. అవతలి ఎండ్ నుంచి సపోర్ట్ లేకపోయినా ఒక్కడే జట్టును కష్టాల కడలి నుంచి బయటపడేశాడు. వికెట్లు పడుతున్నాయని అడ్డగోలు షాట్లు ఆడకుండా క్లాసికల్ బ్యాటింగ్‌తో అందరి మనసులు గెలుచుకున్నాడు. టెయిలెండర్ నవ్‌దీప్ సైనీ (68 బంతుల్లో 25 నాటౌట్) అండతో చెలరేగిపోయాడు ముషీర్. ఖలీల్, కుల్దీప్, ఆవేశ్ బౌలింగ్‌లో ధారాళంగా పరుగులు రాబట్టాడు. ముఖ్యంగా కుల్దీప్ బౌలింగ్‌లో ఎక్కువ రన్స్ వెళ్లాయి. ముషీర్-సైనీ జోడీ ఇండియా ఏ బౌలర్లకు కఠిన సవాల్ విసురుతున్నారు. ఒకవైపు ముషీర్ సింగిల్స్, డబుల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేస్తుండగా.. మరోవైపు సైనీ వికెట్లకు అడ్డంగా నిలబడుతున్నాడు. ఒక ఎండ్‌ను తాను కాపాడితే చాలు.. మరోవైపు ముషీర్ పరుగులు చేస్తాడనే భరోసాతో డిఫెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అతడే గనుక సహకారం అందించకపోయి ఉంటే ఇండియా బీ ఎప్పుడో కుప్పకూలేది. స్టార్ బ్యాటర్లంతా విఫలమైనా సైనీ లాంటి బౌలర్ ఇచ్చిన సపోర్ట్‌తో ఇన్నింగ్స్‌ను ఇక్కడి వరకు తీసుకొచ్చాడు ముషీర్. అతడు ఇంకా క్రీజులోనే ఉన్నాడు. ఇప్పటికే 8వ వికెట్‌కు ముషీర్-సైనీ జంట 108 పరుగులు జోడించారు. ఈ జోడీ ఎంత సేపు క్రీజులో ఉంటే ఇండియా బీకి అంత మంచిది. భారీ స్కోరు ఆశలన్నీ వీరి మీదే ఉన్నాయి. అటు ఇండియా ఏ మాత్రం వీళ్లను త్వరగా ఔట్ చేసి బ్యాటింగ్‌కు రావాలని చూస్తోంది. మరి.. ముషీర్ బ్యాటింగ్ మీకెలా అనిపించిందో కామెంట్ చేయండి.

# బ్యాట్‌తో గర్జించిన అక్షర్..



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఎక్కువగా బంతితో మెరుస్తుంటాడు. అయితే అవసరమైన సమయంలో బ్యాట్‌తోనూ మ్యాజిక్ చేస్తుంటాడు. అవకాశం ఇవ్వాలే గానీ తోపు బ్యాటర్ల రేంజ్‌లో ఆడతాడు. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో ఇది చూశాం. ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా మీద అతడు ఆడిన ఇన్నింగ్స్‌ను అంత ఈజీగా ఎవరూ మర్చిపోలేరు. పొట్టి ప్రపంచ కప్‌తో పాటు ఐపీఎల్, ఇతర సిరీస్‌ల్లోనూ బ్యాట్‌తో గర్జించిన అక్షర్.. బ్యాటింగ్‌లో తన రేంజ్ ఏంటో మరోమారు ప్రూవ్ చేశాడు. దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా డీ-ఇండియా సీ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో థండర్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు అక్షర్. స్టార్లంతా విఫలమైనా అతడు ఒక్కడే యోధుడిలా నిలబడి ప్రత్యర్థులను చీల్చి చెండాడాడు. 118 బంతుల్లో 86 పరుగుల మెమరబుల్ ఇన్నింగ్స్ ఆడాడు అక్షర్. ఇందులో 6 బౌండరీలతో పాటు 6 భారీ సిక్సులు ఉన్నాయి. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా అందర్నీ ఉతికి ఆరేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అతడు మాత్రం క్రీజులో స్తంభంలా నిలబడిపోయాడు. ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందకున్నా నిరాశ చెందకుండా అపోజిషన్ టీమ్ మీద దాడికి దిగాడు. వరుసగా భారీ షాట్లు బాదుతూ ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టించాడు. క్రీజులో ఉన్నంత సేపు ఎడాపెడా షాట్లు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే ఇంకో ఎండ్‌లో క్రమంగా వికెట్లు పడుతూ పోవడంతో ఇండియా డీ 164 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టు సాధించిన పరుగులల్లో సగం రన్స్ అక్షర్ బ్యాట్ నుంచే వచ్చాయి. ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు బాపూ. అయితే జట్టు కోసం చివరి వరకు తాను చేయాల్సిందంతా చేశాడు. టెస్టుల్లో టీ20 తరహా బాదుడుతో ప్రత్యర్థిని వణికించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు దేవ్‌దత్ పడిక్కల్, రికీ భుయ్, శ్రీకర్ భరత్, అధర్వ టైడే లాంటి స్టార్ బ్యాటర్లు అంతా చేతులెత్తేసిన వేళ తాను ఉన్నానంటూ నిలబడ్డాడు అక్షర్. అతడికి ఇంకో ఎండ్ నుంచి సహకారం అంది ఉంటే సిచ్యువేషన్ వేరేలా ఉండేది. ఇక, ఇండియా సీ బౌలర్లలో అంకుష్ కాంబోజ్, హిమాన్షు మనోజ్ చౌహాన్ చెరో 2 వికెట్లతో సత్తా చాటారు. మరో పేసర్ వైశాఖ్ విజయ్ కుమార్ 3 వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. మానవ్ సుతార్, హృతిక్ షోకీన్ తలో వికెట్ తీసి అపోజిషన్‌ను ఆలౌట్ చేయడంలో తమ వంతు సహకారం అందించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సీ ప్రస్తుతం 8.1 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 15 పరుగులతో ఉంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (5), మరో ఓపెనర్ సాయి సుదర్శన్ (7)ను పేసర్ హర్షిత్ రాణా వెనక్కి పంపించాడు. ఆర్యన్ జుయల్ (3 నాటౌట్), రజత్ పాటిదార్ (0 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇండియా డీ బౌలర్లు చెలరేగి బౌలింగ్ చేస్తుండటంతో మ్యాచ్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతోంది.

ప్రజానావ


ప్రతి అక్షరం జనం కోసం..

8


శుక్రవారం
6 సెప్టెంబర్ 2024





# టాలెంట్ రుజువు చేసేకున్న మీనాక్షి



కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ కాంపౌండ్ నుంచి వస్తున్న ది గోట్ వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో తమిళం, తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల అయ్యింది. మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సినిమా విడుదల సందర్భంగా మీడియాతో సినిమా విశేషాలు షేర్ చేసుకుంది. ఈ చిత్రంలో నేను మోడ్రన్ యువతి పాత్రలో కనిపిస్తాను. నేను నిజ జీవితంలో ఎలా ఉంటానో.. అంతే సారుప్యంగా, ఫన్నీగా నా క్యారెక్టర్ ఉంటుంది. సినిమాలో ప్రతీ పాత్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంటుంది. సినిమా కథకు నా పాత్ర చాలా ముఖ్యమైందంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో పోషిస్తుండగా.. ప్రేమలు ఫేం మమితా బైజు కీలక పాత్రలో నటిస్తోంది. ఈ మూవీలో ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం, వీటీవీ గణేశ్, అజ్మల్ అమీర్, మనోబాల ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కిస్తుండగా.. యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.




# నాగచైతన్య పదిహేనేళ్ల ప్రయాణం



సినీ పరిశ్రమలో వారసుల రాక కొత్తేమీ కాదు. విజయం సాధించి, నిలిచిన వారు కొందరైతే.. సక్సెస్ అందుకునే ప్రయత్నంలో ఉన్నవాళ్లు మరికొందరు. ఈ క్రమంలో సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని కొనసాగిస్తున్న స్టార్ కిడ్స్‌లో ఒకడు నాగచైతన్య. అక్కినేని నాగేశ్వర్ రావు ఫ్యామిలీ నుండి నాగార్జున కొడుకుగా.. ఏఎన్ఆర్ మనవడిగా జోష్ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యాడు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చైతూ విజయవంతంగా పదిహేనేండ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నాడు. వాసు వర్మ డైరెక్షన్‌లో చైతూ నటించిన జోష్ 2009 సెప్టెంబర్ 5 వచ్చి, నేటితో 15 ఏండ్లు పూర్తి చేసుకుంది. కథ, దర్శకులపై నమ్మకముంచి.. సినిమా సినిమాకు నటుడిగా తనను తాను నిరూపించుకున్న చైతూకు తండేల్ మేకర్స్, ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు, కోస్టార్లు శు భాకాంక్షలు తెలియజేస్తున్నారు. నాగచైతన్య ప్రస్తుతం చందూమొండేటి డైరెక్ట్ చేస్తున్న తండేల్‌లో నటిస్తున్నాడు. సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు తెరకెక్కిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా ఊర మాస్ లుక్‌లో కనిపించాడు.

## సాదాసీదా కథతో ముగించిన

# ది గోట్ !

**ఈ మధ్య సినిమాల్లో కథలకు ప్రాధాన్యం లేకుండా పోతోంది. ఎటునుంచి ఎటు వెళతాయో చెప్పలేక పోతున్నారు. అలాంటి కోవలోనే గోట్ చేరింది. రాజకీయ ప్రవేశానికి ముందు తమిళ అగ్ర కథానాయకుడు విజయ్ నుంచి వస్తున్న చిత్రం ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ వెంకట్ ప్రభు దర్శకత్వం వహించారు.**

స్పెషల్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందంలో ఏజెంట్‌గా పని చేస్తుంటాడు గాంధీ (విజయ్). కానీ, తన ఉద్యోగం గురించి భార్య అను (స్నేహ)కు అసలు చెప్పడు. తనొకసారి ఓ మిషన్ కోసం థాయ్ ల్యాండ్ వెళ్లాల్సి వస్తుంది. అక్కడికి వెళ్లాక మిషన్ వల్ల గాంధీ కుటుంబానికి ఓ ముప్పు ఎదురవుతుంది. ఈ క్రమంలోనే తన ఐదేళ్ల కొడుకు జీవన్‌ను కోల్పోతాడు. ఆ ఘటనతో గాంధీ తీవ్రంగా కుంగిపోతాడు. తన వల్లే కొడుకును కోల్పోవాల్సి వచ్చిందన్న బాధతో ఉద్యోగం వదిలేస్తాడు. భార్య కూడా అతన్ని దూరం పెడుతుంది. అలా 15ఏళ్లు గడిచిపోతాయి. ఓసారి ఓ పని విషయమై మాస్కోకి వెళ్లిన గాంధీకి అనూహ్యంగా తన కొడుకు జీవన్ (విజయ్) కనిపిస్తాడు. ఓ రౌడీ బృందం ఉచ్చులో చిక్కుకొని ఉన్న తన బిడ్డను కాపాడి భారత్‌కు తీసుకొస్తాడు. కొడుకు రాకతో గాంధీ కుటుంబం మళ్లీ కలుస్తుంది. ఇక అంతా బాగుందనుకున్న సమయంలో గాంధీ స్క్వాడ్ టీమ్ బాస్ నజీర్ (జయరాంను ఎవరో చంపేస్తారు. ఆ తర్వాత ఆ టీమ్;లోని ఒక్కొక్కరూ వరుసగా హత్యకు గురవుతుంటారు. మరి ఈ హత్యలకు కారణమెవరు? జీవన్‌కు ఈ హత్యలకూ ఉన్న లింకేంటి? తను తండ్రిని చంపాలని ఎందుకు పగబడతాడు? జీవన్‌ను పెంచి పెద్ద చేసిన మేనన్ (మోహన్)కు.. గాంధీకీ ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ. దేశ రక్షణ కోసం ఎంతకైనా తెగించే ఓ ఏజెంట్ కథ ఇది. అనుకోని పరిస్థితుల్లో అతను ఓ మిషన్‌లో తన కొడుకును కోల్పోవలసి రావడం.. కట్ చేస్తే ఆ కొడుకే 15ఏళ్ల తర్వాత తన పాలిట యముడిలా మారి దేశానికి పెను సమస్యలా మారడం.. ఈ క్రమంలో అతని ఆట కట్టించేందుకు ఆ తండ్రి ఏం చేశాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. నిజానికి ఈ కథలో పెద్దగా కొత్తదనమేమీ లేకున్నా.. స్క్రీన్‌ప్లే స్పెషలిస్ట్ వెంకట్ ప్రభు తెరకెక్కించిన సినిమా కావడంతో దీంట్లో తప్పకుండా ఓ మ్యాజిక్ కనిపిస్తుందన్న భరోసా ప్రేక్షకుల్లో కపిస్తుంది. కానీ, ఏజెంట్ సినిమాల్లో కనిపించే ట్విస్ట్‌లు, మలుపులు, మెరుపులు ఏ ఒక్కటీ కథనంలో కనిపించలేదు. కనీసం హీరో చేసే ఆపరేషన్స్‌లోనూ థ్రిల్ లేదు. పైగా విరామం వరకూ కథంతా సాగతీత వ్యవహారంమే. హీరోకి తన తనయుడు తారస పడతాడో.. అక్కడి నుంచే కథలో వేగం పుంజుకుంటుంది. ఈ క్రమంలో తనయుడిని కాపాడుకోవడం కోసం మాస్కోలోని విలన్ గ్యాంగ్‌తో గాంధీ చేసే ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తుంది. విరామానికి ముందు జీవన్ పాత్రతో దర్శకుడు ఇచ్చిన ట్విస్ట్ ఆసక్తిరేకెత్తిస్తుంది. దానికి ముందు తండ్రీకొడుకులు మధ్య మెట్రోలో జరిగే యాక్షన్ సీక్వెన్స్ హైలైట్. విరామానికి ముందే జీవన్ విలన్ అని రివీలైపోవడంతో.. ద్వితీయార్ధంలో తండ్రీకొడుకుల మధ్య పోరు ఎలా ఉండనుందా? అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మొదలైపోతుంది. దానికి తగ్గట్లుగానే ద్వితీయార్థం ఆరంభంలో గాంధీకి.. జీవన్‌కూ మధ్య నడిచే మైండ్ గేమ్ కాసేపు ఆసక్తిరేకెత్తిస్తుంది. అయితే, తండ్రిపై పగ పెంచుకోవడానికి జీవన్‌కు ఉన్న కారణాన్ని ప్రభావవంతంగా చూపించలేదు. ఇక మధ్యలో మీనాక్షితో తన లవ్ ట్రాక్.. అనవసరంగా వచ్చి పడిపోయే పాటలు.. యోగిబాబు కామెడీ ట్రాక్.. అన్నీ సహనానికి పరీక్ష. చివరిలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్.. దానితో ముడిపడి సాగే ఐపీఎల్ ట్రాక్ ప్రేక్షకుల్లో కాస్త ఉత్సాహాన్ని నింపుతాయి. తండ్రీకొడుకులుగా విజయ్ ద్విపాత్రాభినయం ఆకట్టుకుంటుంది.

**'ది గోట్ మూవీ' దర్శకుడు వెంకట్ ప్రభు కథలో కొత్తదనం లేదు. ద్వితీయార్థం బాగున్నా, ఓ బలమైన పాయింట్‌తో ముగించాల్సింది.**

## కమర్షియల్ కాలంలో ..

# సాగతీత లెక్కలు !

### అలా వచ్చిందే ..35 చిన్న కథ కాదు



నివేథా థామస్ కథల ఎంపికలో పట్టున్న కథానాయిక. ఆమె ఓ సినిమా అంగీకరించిందీ అంటే.. ఆ సినిమాలో ఏదో విషయం ఉంటుందనే ప్రేక్షకుల నమ్మకం. అలా వచ్చిందే 35 చిన్న కథ కాదు...సరస్వతి (నివేతా థామస్) ప్రసాద్ (విశ్వదేవ్ రాచకొండ) తిరుపతిలో సాధారణ జీవితం సాగించే భార్యభర్తలు. ప్రసాద్ బస్సు కండెక్టర్. సరస్వతి టెన్త్ ఫెయిల్ అయిన గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్దోడు అరుణ్ (అరుణ్ దేవ్), చిన్నోడు వరుణ్ (అభయ్ శంకర్). చిన్నోడు చదువులో పర్వాలేదు కానీ పెద్దోడు లెక్కల్లో వీక్. అందుకే లెక్కల మాస్టారు చాణక్య వర్మ( ప్రియదర్శి) అరుణ్‌ని 'జీరో' అని పిలుస్తాడు. అయితే లెక్కలకు సంబంధించి అరుణ్ ఎప్పుడూ లాజిక్కులు అడుగుతుంటాడు. ఆ లాజిక్కులకు మాస్టార్ల దగ్గర సమాధానం ఉండదు. లెక్కల్లో వరుసగా జీరోలు తెచ్చుకోవడం వల్ల ఒక సంవత్సరం డిమోట్ అయ్యి తమ్ముడు చదువుతున్న క్లాసులో కూర్చోవాల్సి వస్తుంది. స్నేహితులకు దూరమై, చదువు భారంగా మారిన అరుణ్ స్కూల్లో కొనసాగాలంటే లెక్కల్లో కనీసం '35' మార్కులు తెచ్చుకోవాల్సిందే. అప్పుడు అరుణ్ ఏం చేశాడు? స్నేహితులకు దగ్గర కావడానికి, ఏం చేశాడు. లెక్కలంటే భయపడుతున్న కొడుకుకి పదో తరగతి ఫెయిల్ అయిన తల్లి పాఠాలు ఎలా చెప్పింది. చివరికి అరుణ్ లెక్కల్లో పాస్ అయ్యాడా లేదా అన్నది మిగిలిన కథ. తిరుపతిలో నివశించే చిన్న కుటుంబం, ఇద్దరు పిల్లలు వారి భవిష్యత్తు కోసం తపన పడే తల్లిదండ్రులు చుట్టూ తిరిగే కథ ఇది. ప్రథమార్ధం సరస్వతి కుటుంబం, పిల్లలు, స్కూలు, లెక్కల్లో జీరో అయిన అరుణ్ గురించి చూపించారు. బ్రాహ్మణ కుటుంబం, ఇంట్లో వారి పద్దతులు, మాట తీరూ అన్ని కూడా సన్నివేశాల రూపంలో చూపించారు దర్శకుడు. ఆ తర్వాత స్కూల్, అక్కడి పిల్లల యాంగిల్‌లోకి కథ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. మ్యాథ్‌మేటిక్స్ సబ్జెక్ట్ అనేది ఎప్పటికీ అంతు చిక్కని కథే. లాజిక్ తెలిసి, దాన్ని ఎలా సాల్వ్ చేయాలో తెలిస్తే ఆ సబ్జెక్ట్ అంతా ఈజీ, స్కోరింగ్ మరొకటి ఉండదు. ఈ చిత్రంలో చాణక్య (ప్రియదర్శి) పాత్రను అదే కోణంలో డిజైన్ చేశారు. 'నేను పిల్లలతో బాగుండకపోయినా ఫర్వాలేదు. పిల్లలు, వారి భవిష్యతుల్ల బాగుండాలనే తీరు ఆ పాత్రది. కాపీ కొట్టి అయినా 35 మార్కులు తెచ్చుకోవచ్చు అని అరుణ్‌ని పుష్ చేస్తారు. అతను మాత్రం నిజాయతీగా తనని తాను నిరూపించుకోవాలనుకుంటాడు. అక్కడే కథ టర్న్ అయింది. అప్పటి దాకా పిల్లలు, స్కూల్ నేపథ్యంలో సాగిన కథ.. తల్లి కథగా మారింది. సరస్వతి పాత్రని మరింత స్ట్రాంగ్ చేయడం కోసం పదో తరగతి ఫెయిల్ అయిన ఆమె చేత మళ్లీ పుస్తకాలు పట్టించాడు దర్శకుడు. తన బిడ్డను లెక్కల్లో రాణించేలా తీర్చి దిద్దడానికి తను కష్టపడి పిల్లాడికి మంచి బాట వేసే ప్రయత్నం చేసింది. 'సున్నా'కి విలువ ఎందుకు లేదు? అనే క్వశ్చన్‌తో మొదలైంది కథ. లెక్కల్లో ప్లస్, మైనస్‌లు ఉన్నట్లు ఈ చిత్రంలో కూడా ప్లస్, మైనస్‌లు ఉన్నాయి. కథ ప్రారంభం నుంచి నెమ్మదిగా నడవడం, అసలు దర్శకుడు ఏం చెప్పాలనుకున్నాడో రివీల్ కావడానికి 45 నిమిషాల వ్యవధి తీసుకోవడం సినిమాకు మైనస్‌గా అనిపిస్తుంది. 35 మార్కుల కోసం ఇదంతా అని ఊహకు అందినప్పటికీ తెరపై అది రివీల్ కావడం సాగదీతలా అనిపించింది.



## రెండో బిడ్డకు జన్మనిచ్చిన

# నటి ప్రణీత

తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని నటి ప్రణీత సుభాష్. ఇప్పటికే ఓ పాపకు జన్మనిచ్చిన ఈ నటి తాజాగా మరోమారు పండంటి బాబుకు జన్మనిచ్చింది. గురువారం ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో తెలుగు, కన్నడ సినీ ప్రముఖులు, అభిమానుల నుండి సోషల్‌మీడియా వేదికగా ఆమెకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తనీష్ హీరోగా వచ్చిన 'ఏం పిల్లో.. ఏం పిల్లడో'తో 2010 తెలుగులోకి అరంగేట్రం చేసింది. పేరుకు కన్నడ నటి అయినా తెలుగు చిత్రాలతోనే మంచి గుర్తింపు లభించింది. సిద్దార్థ్‌తో చేసిన బావ, పవన్ కల్యాణ్‌తో అత్తారింటికి దారేది, ఎన్టీఆర్‌తో రభస, మహేశ్ బాబుతో బ్రహ్మోత్సవం, మంచు మనోజ్ 'పాండవులు పాండవులు తుమ్మెద' వంటి సినిమాలలో నటించి ఇక్కడ యూత్‌లో అభిమానులను బాగానే సంపాదించింది. 2019 కరోనా అనంతరం సినిమా ఛాన్సులు తగ్గడంతో అడపాదడపా మాత్రమే చిత్రాల్లో కనిపిస్తూ వస్తుంది. 2021లో నితిన్ రాజు అనే ఓ బిజినెస్‌మెన్‌ను పెళ్లి చేసుకున్న ప్రణీత 2022లో ఓ పాప కూడా జన్మనిచ్చింది. తెలుగులో చివరగా బాలకృష్ణ ప్రధాన పాత్రలో వచ్చిన ఎన్టీఆర్: కథానాయకుడు చిత్రం తర్వాత ఆమె మళ్లీ తెలుగులో సినిమా చేయలేదు. ఇదిలా ఉండగా తన డెలివరీ అయ్యాక ప్రణీత తన సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకుంటూ ఓ పోస్టు పెట్టింది. ప్రస్తుతం 'మా కుటుంబమంతా ఎంతో ఆనందంగా ఉంది. ప్రత్యేకించి మా కుమార్తె అర్నా తన తమ్ముడిని 'బేబీ' అంటూ మురిసి పోతోంది. బాబు కాస్త పెద్దయ్యేవరకు నేను జాగ్రత్తగా గడపాలి అని చెబుతోంది.




Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657